క్లుప్తంగా

సీఐగా బాధ్యతల స్వీకరణ



ఎల్కతుర్తి: ఎల్కతుర్తి సీఐగా పులి రమేష్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన ప్రవీణ్‌కుమార్ ధర్మసాగర్ మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పులి రమేష్ వరంగల్ ఏనుమాముల పీఎస్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. పదవీ బాధ్యతలు చేపట్టిన సీఐకి పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



ఎల్కతుర్తి: కేడీసీసీ బ్యాంక్ ఎల్కతుర్తి బ్రాంచ్‌లో ఖాతాదారుడు పానుగంటి తిరుపతిరెడ్డి కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించగా ప్రమాద బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును బుధవారం మృతుడి కుటుంబసభ్యులకు కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ రియాజొద్దీన్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఖాతాదారులు ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, సురక్ష బీమా యోజన పథకంలో కేవలం రూ. 456 చెల్లించి బీమా సౌకర్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ స్రవంతి, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన మౌటం రాజేష్ ఇటీవల చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందగా బాధిత కుటుంబానికి ప్రగతి యువజన సంఘం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రూ.7 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యూత్ అధ్యక్షుడు బాలసాని చిన్న కుమారస్వామి, వ్యవస్థాపక అధ్యక్షుడు పబ్బు సతీష్, గౌరవ అధ్యక్షుడు బాలసాని దేవేందర్, ఉపాధ్యక్షుడు తోడేటి సుందర్, సభ్యులు రాజు, నాగరాజు, కుమారస్వామి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర స్థలాన్ని కాపాడాలని వినతి

కమలాపూర్: మండల కేంద్రానికి సమీపంలోని సమ్మక్క–సారలమ్మ జాతర స్థలం ఆక్రమణకు గురవుతుందని, ఆ స్థలాన్ని కాపాడాలని సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్మన్ ఆస్కార్ అశోక్‌జీ మాట్లాడుతూ సమ్మక్క–సారలమ్మ జాతర గుట్ట వద్ద సర్వే నంబర్ 720లో ఉన్న సుమారు 80 ఎకరాల భూమిని 1985లో ఆదిమూలం వంశీయులు సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణకు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, వారి అక్రమాలకు అడ్డుకట్ట వేసి జాతరకు కేటాయించిన భూమిని కాపాడి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ డైరెక్టర్లు మస్న చంద్రశేఖర్, మౌటం రాజు, కంబంపాటి ప్రసాద్, వైనాల సాంబయ్య, కిన్నెర కృష్ణమూర్తి, ఆడెపు విజయ, పుల్ల సునీల్, మాట్ల కల్యాణ్, మౌటం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

ఆత్మకూరు: వివాహితను వేధింపులకు గురి చేసిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని పెంచికలపేటకు చెందిన ఓ వివాహితను ఇదే గ్రామానికి చెందిన కుండె ప్రశాంత్ తనను ప్రేమించాలంటూ వేధింపులకు గురి చేశాడు. అలాగే వివాహితతో బలవంతంగా ఫొటో దిగి అందరికీ చూపించాడు. ఈ విషయం తెలియడంతో బుధవారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలేరులో..

వేలేరు: వ్యవసాయ బావి వద్ద జరిగిన గొడవలో బచ్చు లక్ష్మణ్ అనే వ్యక్తిపై దాడి చేసిన బచ్చు సదానందంపై కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై సురేష్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ అనే వ్యక్తి తన వ్యవసాయ బావి వద్ద పశువులను మేపుతుండగా సదానందం వచ్చి అకారణంగా నానా బూతులు తిడుతూ తనపై కర్రతో దాడి చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కమలాపూర్: విద్యార్థులకు షూస్, సాక్సులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, ఎస్సై తదితరులు,



శాయంపేటలో..

శాయంపేట: మండలంలోని మైలారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బత్తిని చిన్న తిరుపతి బుధవారం టై, బెల్ట్‌లు, బ్యాడ్జీలను అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు తిరుపతిని అభినందించారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: మండలంలోని కానిపర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్నేహ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం షూస్, బెల్టులు, పండ్ల మొక్కలను ఎంపీడీఓ గుండె బాబు, ఎస్సై వీరభద్రరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులకు వారి సేవలను గుర్తించి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తూరి ఇంద్రసేన, ప్రధాన కార్యదర్శి నరెడ్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జనగాని సుమన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు జనగాని సాంబయ్య గౌడ్, సహాయ కార్యదర్శి కన్నెబోయిన అశోక్, సంయుక్త కార్యదర్శి జనగాని వీరస్వామి, క్రీడా కార్యదర్శి కత్తెర్ల క్రాంతికుమార్, గౌరవ అధ్యక్షుడు తొగరి హన్మయ్య, కోడిగూటి చేరాలు, వడ్లకొండ సంతోష్, జనగాని శివకృష్ణ, బంటి కిషోర్, చారిబాబు, బాలసాని రమేష్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

అటెన్షన్ ప్లీజ్



బీసీ కాలనీకి వెళ్లేదారిలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

పరకాల: వర్షాకాలం వచ్చిందంటే చాలు అస్తవ్యస్తమైన డ్రెయినేజీతో మురుగునీరు రోడ్డుమీదకు చేరుతుంది. దీంతో పట్టణంలోని బీసీ కాలనీకి వెళ్లే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పైగా మురుగునీరు అంతా సమీపంలోని మిషన్ భగీరథ మ్యాన్‌హోల్‌లోకి వెళ్లి తాగునీరు కలుషితమవుతుంది. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : కె.నర్సింహ, పరకాల మున్సిపల్ కమిషనర్,
ఫోన్‌నంబర్ : 7993361942

ప్రణాళికాబద్ధంగా పరకాల అభివృద్ధి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: పరకాల పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకునేందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం అవసరమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశమందిరంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ అధ్యక్షతన పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపాలిటీ పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. డ్రెయినేజీలను శుభ్రం చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, పరకాల మున్సిపల్ కమిషనర్ కె. నర్సింహా, ఏఈ సి.హెచ్ రంజిత్, కౌన్సిలర్స్, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఎల్కతుర్తి: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సార్టీ జూనియర్ కాలేజీ, మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముల్కనూర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం సర్దార్ వల్లబాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ లాంటి మహోన్నతులు, స్వతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలకు తెగించి కొట్లాడి స్వాతంత్ర్యం తెచ్చిన వారిని స్మరించుకోవడం జరిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి ఉపయోగపడుతాయని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసి జాతీయ భావాన్ని వ్యక్త పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొంగల కొమురయ్య, దుర్గసింగ్, మాచర్ల కుమార్, గండు సారయ్య, ఊసకోయిల కిషన్, శ్రీరామోజు శ్రీనివాస్, రాజు, రవీందర్, సాయి, ప్రతాప్, రాజేందర్, వికాస్ వీరన్న, నవీన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధితోనే మహిళా సాధికారత



మార్కెటింగ్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న దామోదర్

కమలాపూర్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని సర్వోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో నాబార్డు, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల జీవనోపాదుల, వ్యాపార సంస్థల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘ సభ్యురాలు జొన్నలగడ్డ మమత నెలకొల్పిన ఆహార ఉత్పత్తి, మార్కెటింగ్ స్టాల్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నైపుణ్యం పెంచుకుని కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ 30 ఏళ్లుగా మహిళా అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని, వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవానికి ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 458 మందికి కంప్యూటర్‌లో శిక్షణ ఇప్పించి వారి ఉపాధి అవకాశాలు పెంపొందించామన్నారు. నాబార్డు సహకారంతో 90 మంది ఔత్సాహిక మహిళలకు టమోటా సాస్, చిల్లి సాస్, చిరు ధాన్యాలతో బిస్కెట్ల తయారీ, నాన్‌వెజ్ పచ్చళ్ల తయారీలో శిక్షణ ఇచ్చామని, మార్కెట్‌లో వీటికి మంచి గిరాకీ ఉందన్నారు. చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలనుకున్న మహిళలకు కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్‌ఎంఈ ఎంటర్‌ప్రైజెస్ స్కీం ద్వారా 35 శాతం సబ్సిడీతో రుణ సదుపాయం అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఇలాంటి స్కీంలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సంస్థ సిబ్బంది కవిరాజ్, ఇందిర, అక్తర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు హైమ, సీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ సిల్వర్ జూబ్లీ వేడుకలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఓంబ్రహ్మం, పూర్వ విద్యార్థులు

శాయంపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే (ఎంజేపీ) బాలుర గురుకుల పాఠశాల 25వ వార్షిక సిల్వర్ జూబ్లీ వేడుకలను ఈ నెల 16, 17న మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ కో ఆర్డినేటర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సిద్దోజు ఓంబ్రహ్మం తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన సిల్వర్ జూబ్లీ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999లో ఎంజేపీ గురుకుల పాఠశాల స్థాపించి నేటికి 25 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు, ఉన్నతాధికారులుగా స్థిరపడినట్లు తెలిపారు. 16న జరిగే ఉత్సవాల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగరాజు, నరేందర్, రామారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారాల తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ షరీఫుద్దీన్

ఆత్మకూరు: మండలంలోని నీరుకుళ్లలోని కోళ్లఫారాలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం డీఎల్‌పీఓ షరీఫుద్దీన్ బుధవారం కోళ్లఫారాలను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ప్రజలు డీఎల్‌పీఓకు సమస్యలు వివరిస్తుండగా రాతపూర్వకంగా ఇవ్వాలని చెప్పడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కూడా కోళ్లఫారాల యజమానుల పక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఐనవోలు: అక్రమంగా రవాణా చేస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న సంఘటన మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టగా ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. 59 తెల్ల బస్తాలు ఉండగా సుమారు రూ. 50 వేల విలువ గల 25 క్వింటాళ్ల బియ్యం ఉంది. ఆటోతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. భువనగిరికి చెందిన గుగులోతు రాజు, రేణుకలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

ఎల్కతుర్తి: మండలంలోని దామెర గ్రామంలో శ్రావణమాసం బుధవారం సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బెల్లం నైవేద్యంతో కూడిన బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ బోనాలు నెత్తిన బెట్టుకొని శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ఆలయం చూట్టూ ప్రదక్షిణలు చేసి పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు. సాగు చేసిన పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు బ్రహ్మచారి, రవీందర్ చారి, శంకరయ్య, సతీష్, చీర్లవంచ అనిల్, కందుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు

శాయంపేట: మండలంలోని పత్తిపాక గ్రామంలోని పోచమ్మ ఆలయం ముందు బురదమయంగా మారడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ కార్యదర్శి ముష్కుల నరేష్ రెడ్డి స్వచ్ఛందంగా డస్ట్ పోసి చదును చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుర్రం రమేష్, లింగాచారి, శశికిరణ్, రాజు, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

మహిళలు, బాలికల రక్షణకు సఖి

వరంగల్: మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం సఖి కేంద్రం అండగా ఉంటోందని సఖి సెంటర్ కౌన్సెలర్ నూర్జహాన్ అన్నారు. 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీనగర్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో నూర్జహాన్, కేస్ వర్కర్ తిరుమల మాట్లాడుతూ బాధిత మహిళలు, బాలికలకు కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం కల్పించడంతో పాటు తాత్కాలిక వసతి వంటి సేవలను అందిస్తున్నట్లు వివరించారు. సఖి సెంటర్ 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందన్నారు. బాధితులు 181 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణ రక్షణ లభిస్తుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న హింస వాటి కి కారణాలు, మహిళల, బాలికల హక్కులు చట్టా లు, గృహహింస చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీ అనిత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

కమలాపూర్: ఈటల నిషాంత్ స్మారకార్థం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి కొనియాడారు. 2007లో అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఈటల నిషాంత్ 17వ వర్ధంతి సందర్భంగా నిషాంత్ స్మారక ట్రస్ట్, కమలాపూర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కమలాపూర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా నిషాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతూ టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, తల్లిదండ్రులు లేని అనాథలకు ఆర్థిక సాయం నిషాంత్ కుటుంబ సభ్యులతో పాటు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ, స్వస్తవ కేన్సర్ కేర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఈటల సమ్మన్న, వైద్యులు డాక్టర్ మదన్‌రావు, కిషన్‌రావు, మసూద్ తాహెర్, పాపిరెడ్డి, అవినాష్, హరీష్, రాకేష్, చతుర్థి, రిటైర్డ్ హెచ్‌ఎం రాంరెడ్డి, నిషాంత్ కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

దామెర: గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు నిర్దేశించిన మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంకుడు గుంతలపై అవగాహన పెంచి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలన్నారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, డీఈఈ భానుకుమార్, ఏఈ సమ్మిరెడ్డి, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దామెర ఎస్సైకి ఉత్తమ అవార్డు



ఎస్సై అశోక్

దామెర: దామెర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధుల నిర్వహిస్తున్న కొంక అశోక్ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ బుధవారం అవార్డుకు ఎంపికైన అధికారులు జాబితాను విడుదల చేశారు. నేడు నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అశోక్ అవార్డును అందుకోనున్నారు. కాగా మొదటి పోస్టింగ్ దామెర పోలీస్‌స్టేషన్‌కు నియమితులై అవార్డుకు ఎంపిక కావడంతో సిబ్బంది, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎల్‌పీఏ నాయకులు, న్యాయవాదులు

వరంగల్ లీగల్: సామాజిక న్యాయ పోరాటంలో బహుజన న్యాయవాదులను భాగస్వాములను చేయడం కోసం ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి బీసీ న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకుడు పొన్నం దేవ్‌రాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో వరంగల్ బార్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశం దేవ్‌రాజ్ మాట్లాడారు. సామాజిక న్యాయ సమరంలో రాజ్యాంగం, చట్టం తెలిసిన న్యాయవాదులు ముందుండాలని సూచించారు. అనంతరం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అంబరీష్‌రావు, తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, చిల్లా రాజేంద్రప్రసాద్, ఆనంద్‌మోహన్, బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్, ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకులు మాధవకృష్ణ, సాయిని నరేందర్, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పగడాల సుదర్శన్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లడే రమేష్, న్యాయవాదులు సత్యనారాయణ, శ్రీనివాస్, ఆంజనేయులు, సుధాకర్, నాగరాజు, భిక్షపతి, రామనాథం, తదితరులు పాల్గొన్నారు.

నిరసన సభకు తరలిన బీజేపీ శ్రేణులు



సభలో పాల్గొన్న బీజేపీ నాయకులు

దామెర: హనుమకొండలో జరిగిన నిరసన సభకు బుధవారం మండలం నుంచి పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ హిందువులపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. హిందువుల ఇళ్లు, మందిరాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గన్ను సతీష్, జిల్లా సీనియర్ నాయకులు వీసం రమణారెడ్డి, కిసాన్‌మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు పొడాల మధుకర్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R) : 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)